# సాయంత్రానికి కోపం వచ్చింది

ఆ రోజు పౌర్ణమి
మళ్ళీ రాలేదు
ఆ వెన్నెల సాయంత్రపు అందమై
అస్తమించే సూర్యుడై
తిరిగి చూడలేదు

ఈ అమావాస్య సుదీర్ఘమై
దీర్ఘ సుషుప్తిలో మునిగి
బద్ధకంగా మూలుగుతుంది

వీడని ఓ నిశీధి
నిరంతర విషాదమై
పర్వతపు పొరలను పేర్చింది

మనసును మూసిన బాధ్యత వలయాల్లా
చీకటి కమ్మిన వెలుగులా
దీపం చుట్టిన నీడలా!

ఆ పౌర్ణమి చిన్నబోయింది
తల్లి కనుమరుగైనప్పుడు పసిబిడ్డ ముఖంలా
వెలుగుకు తారసపడిన చీకటి కోణంలా!

అలాంటప్పుడు ఎలా వుంది?
ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కాగితపు పువ్వులై
పరిమళంలేని మొగ్గలైనట్టుగా వుండదూ!

మన మొహం నవ్వుతున్నట్టు అనిపించినా
కళ్ళల్లో కదలాడే నీలినీడలేవో కలవరపెడుతూనే వుంటాయి
నిద్రలో అస్పష్ట వాస్తవాలేవో తాండవమాడుతూనే వుంటాయి

జీవన సంబంధాలు
సంక్లిష్ట అనుబంధాలై
హృదయబంధనాలై కొనసాగుతూ వుంటాయి

అదీ ఇదీ అని, అటూ ఇటూ అని, నువ్వా నేనా అని
చిక్కుముడులెన్నో
మరవలేని మానవతా విలువలు వెల్లువలా కొనసాగుతున్నప్పుడు

ఇంకోరోజు సరదాగా చంద్రుడు....
మబ్బుల వెనుక నుంచి తొంగిచూసి చిన్నగా నవ్వినట్టూ
సుదీర్ఘ నిశ్శబ్దం, సన్నటి రాగమేదో ఆలకించినట్టుగా తోచింది
ఇంకా.....

చాలా రోజులుగా, చాలా సమయాలలో నుంచి ఇలాంటిదేదో ఉండాలని,
మనసు ఇలాంటి సడులను వినాలని, సందడులను గుర్తించాలని,
మనకనిపించదూ?

మనసున పరచిన సందేహపొరలు ఒక్కటొక్కటిగా పైగెరినట్టు
విశాలమైన ఇసుక తిన్నెలపై వెన్నెల పరచినట్టు
రాత్రివేళ నడిసముద్రం నిశ్శబ్దంగా పయనమైనట్టు

అందమైన ఆ వెన్నెల ఆ పౌర్ణమి కోసం
అలాంటి సాయంత్రాలెన్నో వేచి చూడవూ?
'ఓహ్ షామ్ కుచ్ అజీబ్ థా' అని పడుకోవూ?
'ఏ షామ్ అజీబ్ క్యోం హై' అని ప్రశ్నించవూ?

వెలుగును పరిచే ఉదయాలు
ప్రేమమయ జగత్తు కోసం
మానవతా విలువల కోసం
మనుషుల మధ్య స్నేహపు మాలల కోసం
చేయాల్సిన పనిని మరవనివ్వవు.